సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 19 । మే । 2024



కూర్మనాథుని కల్యాణానికి..

నేడు శ్రీకూర్మంలో స్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. - 8లో



ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు..

ఏపీఈఏపీసెట్‌లో ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 45 మంది గైర్హాజరయ్యారు. - 8లో

అమ్మవారి ఆలయంలో జయాది హోమం

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారి మహోత్సవాల్లో భాగంగా 9వ రోజు శనివారం ఆలయం ఆవరణలో జయాది హోమం ఘనంగా నిర్వహించామని ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. మండపోద్వాసనలు, వర్ధనీ కళసోద్వాసనము, మహా పూర్ణాహుతి, దిక్బలిహరణలు నిర్వహించామన్నారు. అమ్మవారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించామని, శనివారంతో మహోత్సవాలు ముగిశాయని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు తెలిపారు.

న్యూస్‌రీల్

అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఉమ్మడి జిల్లాలో అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ పూర్తిచేశారు. దుప్పలవలస, కొల్లివలస, కంచిలి, ఉంగరాడమెట్ట బాలుర జూనియర్ కళాశాలల్లో 320 సీట్లకు 65 ఖాళీలు మిగిలాయి. బాలికల గురుకుల కళాశాలలు ఎచ్చెర్ల, పెద్దపాడు, తామరాపల్లి, నందిగాం, మందస, పాతపట్నం, వంగర, భామినిల్లో 720 కి 156 ఖాళీలు ఉన్నాయి. ఆ వివరాలను కోఆర్డినేటర్ బాలాజీకి అందజేశారు. ప్రవేశాల మార్గదర్శకాలు వచ్చిన తర్వాత ప్రవేశాలు చేపట్టనున్నారు. ప్రవేశ పరీక్ష ర్యాంకుతో సంబంధం లేకుండా పదో తరగతి మార్కులు ఆధారంగా ప్రవేశించే అంశం పరిశీలిస్తున్నారు.

'అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలి'



మాట్లాడుతున్న ఏపీడీ సన్యాసిరావు

హిరమండలం: వన్‌ధన్ వికాస కేంద్రాలకు అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌ను కల్పించాలని సీతంపేట వైకేపీ ఏపీడీ సన్యాసిరావు అన్నారు. ఆయన శనివారం స్థానిక వెలుగు (వైకెపి)కార్యాలయలంలో ఏపీఎం వి.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆరు వన్‌ధన్ వికాస్ కేంద్రాలు ఉన్నాయని, వాటికి అటవీ ఉత్పత్తులైన జీడి, చీపురు, రాగులుకు తగు మార్కెటింగ్ అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంను ఆదేశించారు. అలాగే డ్వాక్రా స్వయంశక్తి సంఘాలకు సంబంధించిన సర్వే పూర్తి చేయాలన్నారు. అలాగే సంఘాల అప్పులు వంద శాతం వసూలు చేయాలని సూచించారు. సంఘాలు గ్రేడింగ్‌ను పెంచి బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు శ్రీదేవి, అప్పన్న, జయంతి, అసిరయ్య, సుజాత వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

'కొత్త క్రిమినల్ చట్టాలకు సిద్ధం కావాలి'



సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దేశంలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రిమినల్ చట్టాలు ఈ ఏడాది జూలై 1 నుంచి అమలు కానున్నాయని, అందుకు న్యాయవాదులు సిద్ధం కావాలని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ పీపీ మెట్ట మల్లేశ్వరరావు తెలిపారు. జిల్లా కోర్టుల సముదాయంలోని ప్రాసిక్యూషన్ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రిమినల్ చట్టాలపై ఇటీవల హైదరాబాద్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేశారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వాన కృష్ణచంద్, టి.శివప్రసాదరావు, సీహెచ్ శ్రీకాంత్, కె.తిరుమలరావు, కె.శంకరరావు, ఎల్‌వీ రమణ, సీహెచ్ సత్యనారాయణ, కె.ఉషారాణి, ఉషా కిరణ్, కిమిడి సూర్యకుమార్, ఎల్.నాగభూషణం, పి.సుశీల, కె.సుధారాణి, జి.ప్రియదర్శిని, ఆర్.శాంతి, సంతోషి, వి.విజయలక్ష్మి, డి.హరిప్రియ, ఎల్.రఘునాథ్ కార్యాలయ సిబ్బంది భాగ్యలక్ష్మి, పోలీస్ లైజన్ ఆఫీసర్స్ ఆనందరావు, హరికృష్ణ, సురేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

శ్రీకాకుళం, శ్రీకాకుళం అర్బన్: ఇటీవల గుండె నొప్పి కేసులు పెరుగుతున్నాయని, అవగాహనతో వాటిని నియంత్రించవచ్చని చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కుర్మాన వినోద్ కుమార్ అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో గుండె పోటు ముందస్తు జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సరైన సమయంలో సీపీఆర్ ప్రక్రియతో ఆగిన గుండెను బతికించవచ్చని తెలిపారు. ఇందులో భాగంగా సీపీఆర్‌పై తర్ఫీదునిచ్చి అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన రోగికి సత్వరం సీపీఆర్ అందివ్వడం ద్వారా మాత్రమే ఈ ఆకస్మిక, అకాల మరణాలు తగ్గించగలమని తెలిపారు. కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షుడు బగాది ప్రవీణ్ కుమార్, సెక్రటరీ సింగూరు ప్రవీణ్, వాకర్స్ సభ్యులు ఇందిరా ప్రసార్, జోగినాయుడు, లక్ష్మి, మల్లిబాబు, మోహన్, దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళా సేవలో అవిశ్రాంత యోధులు

బదులకు సెలవులు ఇచ్చేశారు. స్నేహితులతో కాలక్షేపం చేద్దామంటే బంధువుల ఊళ్లకు, విహార యాత్రలకు చెక్కేశారు. పోనీ ఇరుగు పొరుగు పిల్లలతో ఆరుబయట ఆడుకుందామంటే ఎండలు మాడు పగులగొడుతున్నాయి. దాంతో ఏమీ తోచక సెలవు రోజులను నిస్సారంగా గడిపేస్తున్న పిల్లలకు ఆ దిగులు లేకుండా చేస్తున్నారు ఇద్దరు గురువులు. తమకు కరతలామలకం అయిన గీత (డ్రాయింగ్) కళతో ఔత్సాహిక విద్యార్థుల సెలవులను సారవంతం చేస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసినా కళా బోధనకు, కళా సేవకు విశ్రాంతి లేదని చాటి చెబుతున్నారు ఈ ఇద్దరు డ్రాయింగ్ టీచర్లు. గత రెండు దశాబ్దాలుగా తమ 'గీత'సారాన్ని పిల్లలకు ఆరారా నూరిపోస్తున్నారు. చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ పేరుతో జిల్లా కేంద్రంలో పిల్లలకు కళలు బోధిస్తున్నారు.



చిన్నారులకు డ్రాయింగ్‌లో మెలకువలు నేర్పుతున్న నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్

• గీత కళతో సెలవులకు సారం



- రిటైరయ్యాక కూడా బోధిస్తున్న టీచర్లు
- చిన్నారులను మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్న వైనం
- శ్రీకాకుళంలో చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ నిర్వహణ
- ప్రతి వేసవిలో 200మందికి విద్యార్థులకు శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్:

పిల్లలు హాయిగా నవ్వాలి. నవ్వుతూ ఆడుకోవాలి. ఆడుతూ నేర్చుకోవాలి. నేర్చుకుంటూ పైకి ఎదగాలి.. చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ ఉద్దేశమిదే. ఇక్కడ డ్రాయింగ్ నేర్చుకున్నా, సంగీత సాధన చేసినా, నృత్యం చేసినా.. దాని ఉద్దేశం సెలవులను సరైన రీతిలో ఉపయోగించుకోవడమే. ఇప్పటికే రెండు వందల మందికిపైగా పిల్లలు ఈ క్లబ్‌లో చేరి తమకు ఇష్టమైన అంశాలను నేర్చుకుంటున్నారు. ఈ క్లబ్ నిర్వహణ వెనుక ముఖ్యంగా ఇద్దరి కృషి ఉంది. 70 ఏళ్ల వయసు దాటినా ఇంకా చురుగ్గా పనిచేస్తున్న ఇద్దరు మాస్టార్ల జీవితముంది.



వీరిద్దరిలో ఒకరు మిమిక్రీ కళలో జాతీయ స్థాయి కళాకారుడిగా పేరు తెచ్చుకుంటే మరొకరు సాంఘిక నాటికలకు ఉత్తమ దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. పట్టణానికి చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్లు లోకనాథం నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయిక్ (బెహరా మధుసూదన పట్నాయిక్)లు కలసి గత 20 ఏళ్లగా చిన్నారుల్లో ఉన్న సృజనను వెలికి తీసేందుకు విశేష కృషి చేస్తున్నారు. వీరికి వచ్చిన చిరు ఆలోచనతో చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్‌ను తమ మిత్రులు మిమిక్రీ శ్రీనివాస్, నటుకుల మోహన్‌ల సహకారంతో ఏర్పాటు చేశారు. చిన్నారులను ఒక చోటకు చేర్చి వారికి ఆటలు, పాటలు, జీకే, వ్యాసరచనలు ఇలా వారి భవిష్యత్‌కు ఉపయోగ పడే ఎన్నో విషయాలపై తర్ఫీదు ఇస్తున్నారు.

ఎప్పుడో రిటైరైనా..

పాతశ్రీకాకుళానికి చెందిన లోకనాథం నందికేశ్వరరావు 1979 నుంచి డ్రాయింగ్ టీచరుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేశారు. చిన్నతనం మిమిక్రీలో నైపుణ్యం చూపేవారు. 1991లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా సత్కారం పొంది, గుర్తింపు పొందారు. 2010లో ఉద్యోగ విరమణ చేశారు. కళింగపట్నానికి చెందిన బీఎంఎస్ పట్నాయిక్‌గా గుర్తింపు పొందిన బెహరా మధుసూదన పట్నాయిక్ అక్కడ నాటకాల సేవలో నిరంతరం ఉండేవారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ఖమ్మం జిల్లా ములుగులో డ్రాయింగ్ టీచరుగా 1966లో పనిచేశారు. ఆంధ్రాకు వచ్చి 1970 నుంచి ఉద్యోగం చేసి 2001లో పదవీ విరమణ చేశారు. 2011లో బాలలతో రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవ పోటీల్లో 'దాడి' నాటికకు దర్శకత్వం వహించి బంగారు నంది సాధించారు. ఇప్పటికీ నంది నాటకాలకు దర్శకత్వం వహిస్తున్నారు.


20 ఏళ్లుగా లాఫింగ్ క్లబ్ సేవలు

చిన్నారుల కోసం 2003లో ఒక లాఫింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ప్రస్తుత రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ ఎల్.నందికేశ్వరరావు తాను ఉద్యోగంలో ఉన్నప్పటి నుంచే దీనికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి కొందరు మిత్రులతో కలసి పట్టణంలోని రివర్ వ్యూ పార్కులో ప్రతి మొదటి, మూడు ఆదివారాల్లోని సాయంత్రం వేళల్లో చుట్టు పక్కల ఉండే చిన్నారులను ఒక చోట చేర్చి వారికి ఆటలు, పాటలు, వ్యాసరచనలు, వకృత్వ పోటీలు ఏర్పాటు చేసి దాతల సహకారంతో వారికి బహుమతులు ఇస్తూ క్లబ్ నిర్వహిస్తున్నారు.

2012లో మొదటి సారిగా వేసవి శిబిరాలు

ఈ ఇద్దరు డ్రాయింగ్ టీచర్లు రిటైరయ్యాక.. డ్రాయింగ్‌ను ఇతరులకు పంచాలనే మంచి ఆలోచనతో వేసవి శిక్షణ శిబిరాలను కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న తమ ఇంటి వద్ద ప్రారంభించారు. ప్రస్తుతం విద్యార్థులు పెరుతున్నందున అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. చిన్నారులకు ఉచితంగా డ్రాయింగ్ బోధన చేస్తు వారిలో ఉన్న టాలెంట్‌ను పెంచుతున్నారు. 2011, 2012 నుంచి వేసవిలో డ్రాయింగ్ శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. కొందరు యువ డ్రాయింగ్ టీచర్ల సహాయం కూడా తీసుకున్నారు. అప్పటి కలెక్టర్ నరసింహం సలహా మేరకు ఒక్క డ్రాయింగ్‌లోనే కాకుండా ఇతర అంశాలైన పేపర్ క్విల్లింగ్, కూచిపూడి నృత్యం, సంగీతం, పెయింటింగ్‌పై శిక్షణలు ఇస్తున్నారు. వేసవి శిబిరంలో పాల్గొని నేర్చుకున్న డ్రాయింగ్ విద్య ద్వారా ఇప్పటికే ఐదుగురు ఉద్యోగాలను సాధించారు కూడా.

ఏడాదికి 200 మంది చిన్నారులు...



చిన్నారులు గీసిన చిత్రాలు

వేసవి సెలవులు వచ్చాయంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడకు పంపడం మొదలు పెట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాలనుంచి చిన్నారులు వచ్చి చేరుతున్నారు. ప్రతి ఏడాది అన్ని విభాగాలలో కలిపి మొత్తంగా 200 మంది చిన్నారులు వారి అభిరుచి మేరకు నేర్చుకుంటున్నారు. నందికేశ్వరరావుతోపాటుగా రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ బీఎంఎస్ పట్నాయిక్, ప్రస్తుతం ఉద్యోగంచేస్తున్న దుర్గా ప్రసాద్, సాయి ప్రసాద్, దీప్తి కూడా తమ సేవలను అందిస్తున్నారు

ఎంతో తృప్తిగా ఉంది



మాకు వచ్చిన విద్యను చిన్నారులకు నేర్పడం ఎంతో తృప్తిగా ఉంది. ఉద్యోగంలో ఉంటూ చేసిన నా ఆలోచనకు కొందరు మిత్రులు తోడై క్లబ్ ఏర్పాటు చేశాం. ముఖ్యంగా చిన్నారులకు వినోదం కలిగించడమే మా ధ్యేయం. విజ్ఞానం కూడా అందిస్తున్నాం.

– ఎల్.నందికేశ్వరరావు, రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్

ఆనందాన్ని ఇస్తోంది..



నా మిత్రుడు నందికేశ్వరరావు పిలుపు మేరకు నా టాలెంట్‌ను కూడా నలుగురికి పంచాలని అతనికి చేదోడుగా నిలిచాను. ఇది నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. రాబోయే తరానికి మంచి విషయాలు నేర్పడం వల్ల మంచి పౌరులుగా మారుతారు.

– బీఎంఎస్ పట్నాయిక్, రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్

చిన్నారులంటే నాకు ఇష్టం



చిన్నారులంటే నాకు చాలా ఇష్టం. వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం మా ఉద్దేశం. లాఫింగ్ క్లబ్‌కు నా వంతు సహకారం అందిస్తున్నాను. చిన్నారుల బాల్యానికి మెరుగు దిద్దుతున్న ఇద్దరు స్నేహితులకు అండగా ఉంటున్నాను.

– నటుకుల మోహన్, క్లబ్ నిర్వాహకులు

పాలకొండ విద్యా'జ్యోతి'

- తెలంగాణ ఈఏపీ సెట్‌లో జ్యోతిరాదిత్యకు స్టేట్ ఫస్ట్



ఆదిత్యను అభినందిస్తున్న తల్లి హైమావతి

పాలకొండ, శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యల కొండ.. పాలకొండ అనే నానుడి మరో మారు రుజువయింది. శనివారం విడుదలైన తెలంగాణ ఈఏపీ సెట్‌లో పాలకొండ మండలం యరకరాయపురం గ్రామానికి చెందిన సతివాడ జ్యోతిరాదిత్య స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి అబ్బుర పరిచాడు. విద్యార్థి తండ్రి సతివాడ మోహనరావు సాంఘిక సంక్షేమశాఖలో సీనియర్ అసిస్టెంట్ (ఎచ్చెర్ల)గా పనిచేస్తుండగా, తల్లి హైమావతి ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువుల కోసం వీరు శ్రీకాకుళంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరి కుమార్తె ఉషశ్రీ ఇప్పటికే ఎంబీబీఎస్ చదువుతుండగా, కుమారుడు ఆదిత్య విజయవాడలో ఇంటర్మీడియట్ చదివి 954 మార్కులు సాధించాడు. తెలంగాణా రాష్ట్రం నిర్వహించిన ఈఏపీ సెట్‌లో ఫస్ట్‌ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రణాళికా బద్ధంగా చదవడం వల్లే మంచి ర్యాంకు వచ్చినట్టు జ్యోతిరాదిత్య తెలిపాడు. విద్యార్థికి యరకరాయపురం వాసులు అభినందనలు తెలిపారు.

టెక్కలి విద్యార్థికి 62వ ర్యాంకు



ప్రణవ్‌సాయి

టెక్కలి: తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో టెక్కలికి చెందిన మలిపెద్ది ప్రణవ్‌సాయి 62వ ర్యాంకు సాధించాడు. అగ్రికల్చర్ అండ్ ఫార్మశీలో 132.4367 మార్కులు సాధించాడు. కుమారుడికి మంచి ర్యాంకు రావడంపై తల్లిదండ్రులు మలిపెద్ది మధుసూదనరావు, సంతోషికుమారి ఆనందం వ్యక్తం చేశారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ట భద్రత

- శివానీలో స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా



భద్రతపై సమీక్షిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా

ఎచ్చెర్ల క్యాంపస్: స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన 18 స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం ఆయన పరిశీలించారు. భద్రత ఏర్పాట్లు పరిశీలించి, పలు సూచనలు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించారు. మూడంచెల భద్రత వ్యవస్థను పరిశీలించారు. రిజిస్టర్ నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ, భద్రత సిబ్బంది నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం ప్రకృతి విపత్తులు, వర్షాలు, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ చర్యలు వంటివి పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించి జిల్లా ఎన్నికలు అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ రాధికలతో సమీక్ష నిర్వహించారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పొలిటికల్ పార్టీల ప్రతినిధుల పరిశీలనకు అన్ని స్ట్రాంగ్ రూమ్‌ల సీసీ కెమెరాల పుటేజ్, సీసీ కెమెరాలు లైవ్ అంతరాయం లేకుండా అందుబాటులో ఉంచాలని సూచించారు. తలుపుల నాణ్యత, గడియలు నాణ్యత, తాళాలు, తాళాలకు వేసిన సీళ్లు సైతం పరిశీలించారు. అనధికార వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రాంతంలోకి అనుమతించ వద్దని అన్నారు. మూడంచెల భద్రత పటిష్టంగా ఉండాలని చెప్పారు. అధికారులు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తమీమా అన్సారియా, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, డీపీఓ వెంకటేశ్వరరావు, రిటర్నింగ్ అధికారులు భరత్ నాయక్, గంగయ్య, అప్పారావు, లక్ష్మణమూర్తి, సుదర్శన్ దొర, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



భద్రత రికార్డు పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా

కిర్గిస్థాన్‌లో వైద్య విద్యార్థులు క్షేమం



రణస్థలం: తజికిస్తాన్‌లో చిక్కుకున్న అనన్య

సరుబుజ్జిలి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థినులు వైద్య విద్య కోసం కిర్గిస్థాన్ వెళ్లారు. ప్రస్తుతం అక్కడ అల్లర్లు జరగడంతో కొన్ని రోజులుగా వారి తల్లిదండ్రులు గందరగోళానికి గురయ్యారు. అయితే వైద్యవిద్యార్థులంతా క్షేమంగా ఉన్నట్లు అక్కడి నుంచి సమాచారం రావడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. జలీలాబాద్ యూనివర్సిటీలో చదువుతున్న తన కుమార్తె మాధురి క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందించిందని తండ్రి కూన జగన్నాథం తెలిపారు. మరో వర్సిటీలో చదువుతున్న డోల శ్వేత కూడా ఇంటికి క్షేమ సమాచారం అందించిందని తండ్రి డోల రామకృష్ణ తెలిపారు. భారత ప్రభుత్వం స్పందించి తమ పిల్లలను స్వదేశాలకు రప్పించే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



సరుబుజ్జిలి: కిర్గిస్థాన్‌లో క్షేమంగా ఉన్న వైద్య విద్యార్థులు


తజికిస్తాన్‌లో చిక్కుకొన్న వైద్య విద్యార్థి

రణస్థలం: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న శ్రీదేవి మహంతి కుమార్తె అనన్య తజికిస్తాన్‌లో మెడిసిన్ చదువుకునేందుకు రెండేళ్ల క్రితం వెళ్లారు. అక్కడ వైద్య విద్యార్థులపై దాడులు జరుగుతున్నాయి. దీంతో కుమార్తె క్షేమ సమాచారంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనన్య అక్కడ మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతోంది. భారత ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

• మడుగులో మీనాల వేట

మడుగు అడుగంటినా తమ కడుపు నింపుతుందని కొంగలు ఆశ్రయించాయి. ఎండ ధాటికి నీరింకిపోతున్న కొలనులో చేపల కోసం ఇలా వెతికాయి. టెక్కలి సమీపంలో ఈ దృశ్యం కనిపించింది.

- టెక్కలి



మలేషియాలో మన చిన్నారి ప్రతిభ



ఇండియా జెండాతో చిన్నారి ప్రత్యూష

కాశీబుగ్గ: మందస మండలం దున్నవూరు గ్రామానికి చెందిన దున్న ప్రత్యూష కరాటేలో సత్తా చాటింది. ఇటీవల జరిగిన మలేషియా ఓపెన్ చాంపియన్ షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. దున్నవూరు గ్రామానికి చెందిన దున్న కృష్ణారావు, స్వాతి దంపతుల ఏడేళ్ల కుమార్తె దున్న ప్రత్యూష కరాటేలో చిన్ననాటి నుంచి ప్రావీణ్యం సంపాదించింది. మలేషియాలో జరిగిన పోటీల్లో రాణించడంతో దున్నవూరు గ్రామస్తులు, తల్లిదండ్రులు చిన్నారిని అభినందించారు. తండ్రి దున్న కృష్ణారావు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో వెల్డింగ్ పనులు చేస్తుంటారు.

క్లుప్తంగా

ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు ప్రారంభం



చిలకపాలేం శివానీలో విద్యార్థుల హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మశీ ప్రవేశాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2024 (ఏపీఈఏపీసెట్) ఈ నెల 18 నుంచి నాలుగు పరీక్ష కేంద్రాల్లో కొనసాగుతోంది. బైపీసీ స్ట్రీమ్ పరీక్షలు ముగియగా, ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు శనివారం ఒక షిఫ్టులో నిర్వహించారు. 1040 మందికి గాను 995 మంది హాజరు కాగా, 45 మంది గైర్హాజరయ్యారు. ఇప్పటివరకు సెట్‌కు సంబంధించి 5,100 మందికి 4,753 మంది హాజరు కాగా, 352 మంది గైర్హాజరయ్యారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో శనివారం విద్యార్థుల హాజరు పరిశీలించగా చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో 229 మందికి 221, నరసన్నపేట కోర్ టెక్నాలజీస్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో 330కి 303, ఎచ్చెర్ల వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 180 కి 175, టెక్కలి ఐతంలో 301 కి 286 మంది హాజరయ్యారు. పరీక్షలు ఈ నెల 23 వరకు కొనసాగనున్నాయి.

పారామెడికల్‌లో బొల్లినేని విద్యార్థుల హవా



టాపర్ లలితకుమారి

శ్రీకాకుళం రూరల్: డిప్లమా పారామెడికల్ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థులు చక్కటి ప్రతిభ చూపినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఏపీ ఎలైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ కౌన్సిల్ విజయవాడ విడుదల చేసిన డిప్లమా ఫలితాల్లో క్యాథ్ ల్యాబ్ టెక్నాలజీ విద్యార్థి పేడాడ లలితకుమారి 360 మార్కులకు 306 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు ప్రకటించారు. డిస్టింక్షన్‌లో నలుగురు విద్యార్థులు, ప్రథమ శ్రేణిలో 24 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థులను సంస్థ అకడమిక్ డైరెక్టర్ లక్ష్మీ పద్మజ అభినందించారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బీఎస్సీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని, వివరాలకు 7680945357, 7995013422 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నేత్రపర్వంగా బంగారు వెంకన్న దర్శనం



బంగారు వెంకన్నకు పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమల కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం బంగారు కవచ ధారణతో స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విశేష ఆరాధన, సహస్ర తులసీదళార్చనలు జరిగాయి. అలాగే మహాలక్ష్మీ అమ్మవారిని కూడా బంగారు కవచంతో అలంకరించారు. ఆదివారం స్వామి కల్యాణ వేడుకలు జరుగుతాయని ఆలయ ఈఓ పి.శ్యామలరావు తెలిపారు.

కూర్మనాథుని కల్యాణానికి వేళాయె



శ్రీకూర్మనాథాలయం

- శ్రీకూర్మంలో నేడు స్వామి కల్యాణోత్సవం
- ముమ్మరంగా ఏర్పాట్లు

గార: ప్రఖ్యాత శ్రీకూర్మ క్షేత్రంలో కూర్మనాథుని కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినాన వార్షిక కల్యాణం నిర్వహించనున్నారు. ఆదివారం 10 గంటలకు కల్యాణోత్సవం జరగనుంది. గత తొమ్మిది రోజులుగా పందిరి రాట నుంచి కొట్నం దంపు వరకు పలు కార్యక్రమాలను దేవస్థానం నిర్వహించింది.

కూర్మనాథాలయ ఆవిర్భావం

శాలిహుండాన్ని రాజధానిగా చేసుకొని ఈ ప్రాంతాన్ని శ్వేతచక్రవర్తి పరిపాలిస్తున్న సమయంలోనే శ్రీకూర్మనాథాలయం నిర్మాణాలు జరిగాయని పురాణాలు పేర్కొంటున్నాయి. విష్ణువు కూర్మం (తాబేలు) అవతారంలో స్వయంభువుగా ఉండటం, బ్రహ్మ ఈ ఆలయాన్ని ప్రతిష్టించడం, ప్రతి రోజూ రాత్రి సమయాల్లో దేవతలు దర్శనం జరుగుతుందని నమ్మడం వంటి అనేక విశేషాలు ఈ ఆలయంలో ఉన్నాయి. స్వామి ఇక్కడ కొలువుండటంతో లక్ష్మీదేవి సుదర్శన చక్రం ద్వారా ఏర్పడిన శ్వేతపుష్కరిణిలో ఆవిర్భవించిందని చెబుతుంటారు. దుర్గాదేవి రాత్రివేళ గర్భగుడి చుట్టూ ఉన్న బేడా మంటపంపై స్వామి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ నృత్యం చేస్తుందని, ఈ నాట్య ధ్వనులు కొన్నేళ్ల క్రితం వరకు ఆలయం నుంచి వినిపించేవని స్థానికులు అంటుంటారు. ఈ క్షేత్రాన్ని ఎనిమిదో శతాబ్దంలో ఆదిశంకరాచార్యులు సందర్శించి స్వామికి సుదర్శన సాలగ్రామాన్ని సమర్పించారు. 11వ శతాబ్దంలో రామానుజాచార్యులు సందర్శనలో గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాలను సమర్పించారు. 13 వ శతాబ్దంలో మధ్వాచార్యుల శిష్యులైన శ్రీనరహరితీర్థులు క్షేత్రాన్ని సందర్శించి సీత, రామలక్ష్మణ ఉత్సవమూర్తులను బహూకరించారు. 1512 వ సంవత్సరంలో చైతన్య మహాప్రభువులు క్షేత్రాన్ని సందర్శించారు. చైతన్య మహా ప్రభువుల పాదముద్రలు ఆలయాన పశ్చిమ భాగంలో దర్శించవచ్చు. లవకుశులు, దుర్వాసుడు, శ్రీకృష్ణదేవరాయుల వంటివారు క్షేత్రాన్ని సందర్శించారు. ఈ క్షేత్రంలో అన్ని మతాల వారికి గర్భగుడి ప్రవేశం ఉంది. నిత్య అభిషేకాలు జరిగే అరుదైన వైష్ణవ క్షేత్రమిది.

నేడే కల్యాణోత్సవం

నేడు జరిగే కల్యాణోత్సవం ప్రముఖమైనదిగా చెప్పవచ్చు. కూర్మనాథుని ఆవిర్భావం నుంచి ఈ కల్యాణం జరుగుతోందని తెలుస్తోంది. స్వామి కల్యాణోత్సవానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి తిరువీధికి ఉత్సవ వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ఆలయ ఈఓ జి. గురునాథం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



తులసీ అలంకరణలో శ్రీకూర్మనాథుడు



ఉత్సవానికి సిద్ధం చేసిన వాహనాలు

వైభవంగా కొట్నం దంపు



కొట్నం దంపు జరుగుతున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం వేళ ఆలయంలో కొట్నం దంపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఏడాదికోమారు జరిగే తిరుక్కల్యాణం ముందురోజున ఈ కొట్నం దంపును ముత్తైదువులతో శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం మూల విరాట్‌కు విశేష అర్చనలు, హోమాలను ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం వేళ ఆస్థాన మంటపంలో స్వామి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వాములను వేంచింపచేసి రాజా వారి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. విశ్వక్సేన పూజ, పరిషత్ వంటి వైదిక క్రియలు జరిగాయి. అనంతరం కొట్నం దంపు కోసం వినియోగించే కర్ర రోలుకు ప్రత్యేక పూజలు చేసి, ధాన్యంతో పాటు సుగంధ ద్రవ్య మర్దన జరిపారు. కొట్నం దంపులో ధాన్యాన్ని దంచగా వచ్చిన బియ్యంతో ప్రసాదాన్ని తయారుచేసి స్వామికి కల్యాణం రోజున నివేదన చేస్తారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.గురునాథం, దాసుబాబు, స్థానాచార్యులు శ్రీ భాష్యం పద్మనాభాచార్యులు, కిశోర్‌బాబు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై

దాడికి అచ్చెన్నే బాధ్యుడు

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



విశాఖపట్టణం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త మల్లేష్‌ను పరామర్శిస్తున్న దృశ్యం

టెక్కలి: నిమ్మాడ పంచాయతీ చిన్నవెంకటాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త తోట మల్లేష్‌పై జరిగిన దాడికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడు హరివరప్రసాద్, ఎంపీ రామ్మోహన్‌నాయుడులే బాధ్యత వహించాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. టీడీపీ కార్యకర్తల చేతిలో తీవ్రంగా గాయపడిన తోట మల్లేష్ పరిస్థితి విషమంగా ఉందన్నారు. అంతే కాకుండా నిమ్మాడ పంచాయతీలో అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు, హరివరప్రసాద్‌తో పాటు వారి కుటుంబ సభ్యులతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ప్రాణహాని ఉందన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో కోటబొమ్మాళి మండలంతో పాటు మిగిలిన మండలాల్లో టీడీపీ నాయకులు పూర్తి స్థాయిలో రిగ్గింగ్‌లకు పాల్పడకుండా కట్టడి చర్యలు చేపట్టడంతో, వారికి ఓటమి భయం పట్టుకుందని తిలక్ గుర్తు చేశారు. అందుకే ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో అల్లర్లు సృష్టించాలని పెద్ద ఎత్తున కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. తోట మల్లేష్‌పై జరిగిన దాడికి టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడు హరివరప్రసాద్, ఎంపీ రామ్మోహన్‌నాయుడులను బాధ్యులుగా చేసి తక్షణమే అరెస్టు చేయాలని తిలక్ డిమాండ్ చేశారు.

‘అధైర్య పడొద్దు అండగా ఉంటాం’

టెక్కలి: కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ చిన్నవెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తోట మల్లేష్‌పై దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తలకు శిక్ష పడే విధంగా, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ భరోసానిచ్చారు. విశాఖపట్టణం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తోట మల్లేష్‌ను శనివారం తిలక్‌తో పాటు నాయకులు హేమసుందర్‌రాజు, అన్నెపు రామారావు తదితరులు పరామర్శించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో చిన్నవెంకటాపురం పోలింగ్ బూత్‌లో వైఎస్సార్‌సీపీ తరఫున తోట మల్లేష్ కుమారుడు మాధవరావు ఏజెంట్‌గా వ్యవహరించారు. అది తట్టుకోలేక గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పూతి లక్ష్మణరావు, పూతి భానుచందర్, పూతి కర్రెన్న, పూతి రమణ తదితరులు మాధవరావు తండ్రిపై మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. మాధవరావు ప్రస్తుతం విశాఖపట్టణం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పేరాడ తిలక్‌తో పాటు నాయకులు సంపతిరావు హేమసుందర్‌రాజు, అన్నెపు రామారావు తదితరులు విశాఖపట్టణం కేజీహెచ్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అధైర్య పడొద్దని తిలక్ భరోసా కల్పించారు.

గ్రామంలో దొంగల భయం

టెక్కలి రూరల్: టెక్కలి మండలం పరిధిలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో దొంగల భయం వెంటాడుతోంది. మండలంలోని అక్కవరం గ్రామంలో ఈ నెల 11వ తేదీన కొంత మంది దొంగలు ఇళ్లలో చొరబడి బీరువాను ఎత్తుకు పోయి గ్రామ సమీపంలోని పొలంలో పడేసిన విషయం తెలిసిందే. అది మరువక ముందే అదే గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు ఒక ఇంటి రేకుల పైనుంచి ఇంటి డోర్ తీసేందుకు ప్రయత్నిస్తుండగా శబ్దం రావడంతో చుట్టు పక్కల వారు కేకలు వేశారు. దీంతో ఆ వ్యక్తులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. పోలీసులు రాత్రి సమయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద బాధితునికి రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం



విశాఖపట్నంలో బాధితుడిని పరామర్శిస్తున్న ప్రకాష్

కవిటి: మండలంలోని శిలగాంకు చెందిన కాళ్ల తాతయ్య అనే వ్యక్తికి శిలగాం వైఎస్సార్‌సీపీ మండలకన్వీనర్ కడియాల ప్రకాష్ తనవంతుగా రూ.1,80,000 ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు శనివారం విశాఖపట్నంలో ఓ ఆస్పత్రిలో బాధితుడిని కలిసి భరోసా కల్పించారు. ఇటీవల తాతయ్య గ్రామంలోని చింతామణి ఆలయం పనులకు గ్రానైట్ పలకరాళ్లను తెస్తుండగా ప్రమాదవశాత్తు రాయి జారి పడిపోయి రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. బాధితుడు ప్రస్తుతం విశాఖలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం తీవ్రం కావడంతో అతడిని ఆదుకునేందుకు కవిటి మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ విశాఖపట్నం వెళ్లి బాధితునికి తన వంతుగా రూ.1,80,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రస్తుతం తాతయ్య కోలుకున్నారని ప్రకాష్ తెలిపారు. బాధితునికి తమ వంతుగా మండలంలోని యువజన సంఘాలు ,గ్రామ సంఘాలు, గ్రామస్తులు తదితరులు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బాధితుడిని పరామర్శించిన వారిలో డాక్టర్ కడియాల నిఖిల్, సంతోష్, మేఘనాథ్ తదితరులు ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ఎంతో అవసరం



బాలల హక్కుల కోసం వివరిస్తున్న జూనియర్ కోర్టు సివిల్ జడ్జి మణి

ఆమదాలవలస రూరల్: బాలల సంరక్షణ కోసం కల్పించిన హక్కులను అమలు చేయాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. పట్టణంలో గల ఐసీడీఎస్ కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణ గురించి శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను సంరక్షించడానికి ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటిని తప్పకుండా పాటించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేసి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం క్రమంగా అందజేస్తే ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు.

కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు సీపాన గోవిందరావు, తమ్మినేని అన్నంనాయుడు, కింతలి త్రినాథరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు మీద ధాన్యం రాశులు



అల్లాడ వద్ద రోడ్డుపై ఎండకు ఆరబెట్టిన దాన్యం

జలుమూరు: ఇటీవల కురిసిన వర్షాలకు రబీ వరి ధాన్యం కొంత మేర తడిసింది. శనివారం మంచి ఎండ వేడిమి తగలడంతో రైతులు రోడ్లపై ధాన్యం రాశులను ఇలా ఎండబెట్టారు. జలుమూరు, అల్లాడ, పాగోడు, వెలుసోద తదితర గ్రామాల్లో ఇలాధాన్యం ఎండుబెడుతున్నారు.

వైఎస్సార్‌సీపీకి ఓటేశారని వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన శ్రీనివాసరావును రిమ్స్‌లో పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పోలాకి: మండలంలోని సంతలక్ష్మీపురం పంచాయతీ పరిధి సన్యాసిరాజుపేట గ్రామానికి చెందిన ఉప్పాడ శ్రీనివాసరావు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన బొడ్డేపల్లి జగన్నాథం దాడికి పాల్పడ్డాడు.

బాధితుడి ఫిర్యాదు మేరకు పోలాకి ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. బాధితుడు రైల్వే గ్యాంగ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఎన్నికల నేపథ్యంలో గ్రామానికి వచ్చాడు. అయితే వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటేశాననే అక్కసుతో తనపై దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావును మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు శనివా రం పరామర్శించారు. పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి



మృతి చెందిన చిన్నమ్ముడు (ఫైల్)

నరసన్నపేట: జాతీయ రహదారిపై మండలంలోని తామరాపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ధర్మాన చిన్నమ్ముడు(65) శనివారం మృతి చెందారు. భవన నిర్మాణ పనులకు వెళ్లిన చిన్నమ్ముడు పనులు ముగించుకొని శుక్రవారం రాత్రి ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా టెక్కలి నుంచి నరసన్నపేట వైపునకు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. వెంటనే గ్రామస్తులు అప్రమత్తమై అంబులెన్స్‌లో ఆమెను శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. గాయాలు తీవ్రం కావడంతో శనివారం మృతి చెందారు. చిన్నమ్ముడుకు ముగ్గురు పిల్లలు. కుమారుడు భాస్కరరావు ఇటీవల ఒక ప్రమాదంలో మృతి చెందాడు. కుమార్తెలు రోహిణి, పద్మలకు వివాహమైంది. ప్రమాదంపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభం మీద పడి కార్మికుడి మృతి



మృతి చెందిన ధర్మారావు

పొందూరు: మండలంలోని రెడ్డిపేట–తానెం మధ్యన విద్యుత్ లైన్ పనులు చేస్తుండగా.. శుక్రవారం సాయంత్రం విద్యుత్ స్తంభం పైన పడటంతో కార్మికుడు పాగోటి ధర్మారావు(48) మృతి చెందాడు. శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురం పంచాయతీ మామిడివలసకు చెందిన ధర్మారావు విద్యుత్ లైన్ ఏర్పాటుకు సంబంధించి లేబర్ పనికోసం వచ్చాడు. అందులో భాగంగా విద్యుత్ స్తంభాన్ని పైకి ఎత్తుతున్న సమయంలో అది అదుపు తప్పి అతనిపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న అతడిని తోటి కార్మికులు వ్యాన్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. గాయపడిన కార్మికుడిని పరీక్షించిన వైద్యాధికారులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

టెక్కలి రూరల్: స్థానిక అయ్యప్పనగర్‌లో నివాసముంటున్న జోగి రేణుక అనే మహిళపై ఆమె భర్త దాడి చేయడంతో ఆమె టెక్కలి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జోగి రేణుక, ఆమె భర్త ఢిల్లేశ్వరరావుకు మనస్పర్థలు ఉండడంతో కొంత కాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. రేణుక తన కుమార్తెతో కలిసి తల్లి దేవాది అప్పలనరసమ్మతో కలిసి ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఆమె తన ఇంటి బయట కూర్చుని ఉండగా ఆమె భర్త క్రికెట్ బ్యాట్‌తో తలపై దాడి చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన రేణుక తల్లిపైనా దాడి చేసి వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తీవ్రగాయాలకు గురైన వారిని స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె భర్త రైల్వేలో ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండలంలోని పాతనౌపడ గ్రామానికి చెందిన వాకడ వినోద్ అనే యువకుడు శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. వినోద్ టెక్కలిలో పలు ఎలక్ట్రికల్ షాపుల్లో పనిచేసేవాడు. కొన్నాళ్ల కిందట ఆ యువకుడు ప్రైవేటు లోన్‌లో కొంత మొత్తంలో డబ్బులు వాడుకున్నాడు. దాన్ని సరిగా కట్టకపోవడంతో వారు ఇంటికి వచ్చి అడిగారు. దీంతో ఇంట్లో చిన్నపాటి తగాదా జరిగింది. దీంతో ఆ యువకుడు గత కొద్ది రోజులుగా ఇంటికి వెళ్లకుండా బయటే ఉంటున్నాడు. ఏం జరిగిందో గానీ శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గుర్తించిన స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి



గొర్లె గన్నయ్య (ఫైల్)

బూర్జ: మండలంలోని ఉప్పినివలస గ్రామానికి చెందిన గొర్లె గన్నయ్య (58) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందారు. గ్రామస్తులు తెలియజేసిన వివరాల మేరకు.. గన్నయ్య శుక్రవారం సాయంత్రం ఆవులను మేతకు తీసుకెళ్లారు. తొలి సింగన్నపాలెం నుంచి పాలకొండ రోడ్డు మీదుగా శ్రీకాకుళం వైపు తీసుకువస్తుండగా నామాల లక్ష్మీపురం గ్రామ మలుపు దగ్గర స్కూటీ ఢీకొట్టింది. దీంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. క్షతగాత్రుడిని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. గన్నయ్య తలకు కుడివైపున బలమైన గాయమైందని, అందుకే చనిపోయాడని తెలిపారు.

మృతుడికికి భార్య గొర్లె చిన్నమ్ముడు, ఒక్క అబ్బాయి ఉన్నాడు. కొడుకు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. భార్య చిన్నమ్ముడు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఇన్‌చార్జి ఆమదాలవలస ఎస్‌ఐ–2 ఐ.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.